క్లుప్తంగా

శ్రీకృష్ణదేవరాయలకు ఘన నివాళి



శ్రీకృష్ణదేవరాయలకు నివాళులర్పిస్తున్న నాయకులు

అగనంపూడి: ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలకు 85వ వార్డు గొన్నవానిపాలెంలో అగనంపూడికి చెందిన కాపునాడు నాయకులు నివాళులర్పించారు. తెలుగు భాషలందు తెలుగు లెస్స అని కొనియాడిన కవి పోషకుడు, తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పిన మహారాజు శ్రీకృష్ణదేవరాలయలని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొన్నా హేమంత్, బలిరెడ్డి సత్యనారాయణ, దాసరి సత్యనారాయణ, గొన్న రమణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌సిటీ డిపోను యథావిధిగా కొనసాగించాలి



లేఖతో ఎన్ఎంయూ నాయకులు

ఉక్కునగరం: కూర్మన్నపాలెంలోని ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోను యథావిధిగా కొనసాగించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్టీల్‌ప్లాంట్ సీఎండీకి లేఖ అందజేశారు. స్టీల్ సిటీ డిపో వల్ల కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతాల ప్రజలకు రవాణా సదుపాయం మెరుగుపడిందన్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గడువు లీజును పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.ఆర్.రావు, జిల్లా కార్యదర్శి పిళ్లా శంకరరావు, జిల్లా అధ్యక్షుడు పి.ఎస్. మూర్తి, నాయకులు ఎ.కె. శివాజీ, వి.ఎస్.ఆర్. మూర్తి, బి.ఎం. రావు, కె.సీహెచ్. బాబు, బి.కె. రాజు, పి.ఎస్. రావు, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ స్థలం కబ్జా



స్టీల్‌ప్లాంట్ స్థలంలో సాగిస్తున్న నిర్మాణం

● యథేచ్ఛగా నిర్మాణ పనులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బర్మా కాలనీలో, టిడ్కో గృహ సముదాయం ఎదురుగా స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించి స్థలం ఉంది. ఆ స్థలాన్ని ఒక వ్యక్తి కబ్జా చేసి అక్కడ నిర్మాణ పనులు ప్రారంభించాడు. దీంతో స్థానికులు స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారి సునీతకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆమె ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆర్ఐ అప్పారావును ఆదేశించారు. దీంతో ఆయన అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే ఆక్రమణదారుడు అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేశాడు. యథేచ్ఛగా నిర్మాణ పనులు చేస్తున్నాడు. దీంతో స్థానికులు మండిపడుతున్నారు. స్టీల్‌ప్లాంట్ అధికారుల తీరును ఎండగడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణదారునిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు

గాజువాక: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ పోటీలను 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ పోటీలకు మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 600 మంది విద్యార్థులు హాజరైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ ప్రశాంతి తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సునీత, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువరులకు వరం.. ఈ గ్రంథాలయం

● అందుబాటులో 7,300 పుస్తకాలు
● బుక్స్ ఆన్ డిమాండ్ పేరుతో కోరితే కావాల్సిన పుస్తకాలు రెడీ



గ్రంథాలయంలో పుస్తకాలు



కాంపిటీటివ్ పరీక్షల స్టడీ మెటీరియల్

గాజువాక: స్థానిక గ్రంథాలయం పాఠకులకు ఒక వినూత్న అవకాశాన్ని అందిస్తోంది. బుక్స్ ఆన్ డిమాండ్ పేరుతో పాఠకులు కోరిన పుస్తకాలను అందుబాటులోకి తీసుకొస్తోంది. పోటీ పరీక్షలకు హాజరు కాగోరే అభ్యర్థులు, గ్రంథాలయ పాఠకులు తమకు కావాల్సిన పుస్తకాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తే గ్రంథాలయాధికారులు వాటిని కొనుగోలు చేసి అందజేస్తున్నారు. దీంతో నిరుద్యోగ యువతకు ఇక్కడి శాఖా గ్రంథాలయం విజ్ఞానాన్ని అందించే కల్పతరువుగా మారింది. ఫలితంగా గాజువాక ప్రాంత నిరుద్యోగులే కాక గాజువాక చుట్టుపక్కల మండలాలకు చెందిన నిరుద్యోగులు కూడా ఇక్కడికొచ్చి తమకు కావాల్సిన పుస్తకాలు తీసుకెళ్తున్నారు.

విశేష పాఠకాదరణ..

గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో గల గాజువాక శాఖా గ్రంథాలయాన్ని పాఠకులు విశేషంగా ఆదరిస్తున్నారు. ప్రతిరోజు 60 మందికి పైగా పాఠకులు వచ్చి వెళ్తుంటారు. ఇక్కడికి వచ్చే పాఠకుల్లో మహిళలే అధికంగా ఉంటున్నారని గ్రంథాలయాధికారి సూర్యకళ తెలిపారు. రోజుకు సగటున 16 పుస్తకాలు బయటికి వెళ్తుంటాయి. ఇవికాక, 8 దినపత్రికలు, 2 వార పత్రికలు, 1 పక్ష పత్రిక, 12 మాస పత్రికలు అందుబాటులో ఉన్నాయి.

పోటీ పరీక్షలకు ప్రత్యేకం..

పోటీ పరీక్షలకు హాజరు కాగోరు అభ్యర్థులకు గాజువాక శాఖా గ్రంథాలయం కల్పతరువు అనే చెప్పాలి. ఏ సబ్జెక్టులోనైనా అభ్యర్థులు కోరిన పుస్తకాన్ని ఇక్కడి సిబ్బంది వెంటనే ఏర్పాటు చేస్తున్నారు. గ్రూప్-2 సహా వివిధ కాంపిటీటివ్ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్ గ్రంథాలయంలో అందుబాటులో ఉంచారు.

పెరుగుతున్న సభ్యులు..

గ్రంథాలయంలో సభ్యుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ప్రస్తుతం 3200 మంది సభ్యులుగా ఉన్నారు. గడిచిన నెలలో 24 మంది సభ్యత్వం తీసుకున్నారు. అన్నివర్గాల పాఠకులకు అవసరమైన పుస్తకాలు తమ వద్ద అందుబాటులో ఉండటంతో పాఠకుల సంఖ్య పెరుగుతోందని గ్రంథాలయాధికారి తెలిపారు. ప్రస్తుతం గ్రంథాలయంలో 7,300 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూతో పాటు ఇతర భాషా పుస్తకాలు కూడా ఉన్నట్టు గ్రంథాలయాధికారి చెప్పారు.

పాఠకులనుంచి అనూహ్య స్పందన..



మా గ్రంథాలయంలో పాఠకులకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ వేల పుస్తకాలు వివిధ భాషల్లో ఉన్నాయి. నిరుద్యోగులకు కావాల్సిన అన్ని పుస్తకాలను మేము అందుబాటులో ఉంచుతాం. అందుకే అనూహ్య స్పందన లభిస్తోంది. ఎప్పటికప్పుడు కొత్త పుస్తకాలు కొనుగోలు చేస్తున్నాం. బుక్స్ ఆన్ డిమాండ్‌కు స్పందన బాగుంది. – సూర్యకళ, గ్రంథాలయాధికారి

సాక్షిపై వేధింపులకు నిరసనగా జర్నలిస్టుల ఆందోళన



గాజువాక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు

గాజువాక: సాక్షి ఎడిటర్, నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జిపై అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేస్తున్న పోలీసుల చర్యలను నిరసిస్తూ గాజువాక ప్రాంత విలేకరులు ఆందోళన నిర్వహించారు. సాక్షి పైన, సాక్షి పాత్రికేయుల పైన వేధింపులు ఆపాలని, పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించవద్దంటూ పెద్దపెట్టున నినదించారు. గాజువాక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కాకి రాంబాబు (రాము) మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ పత్రికలపై కక్షపూరితంగా, పక్షపాతంగా వ్యవహరించడం తగదని అన్నారు. పత్రికల్లో ప్రభుత్వ వ్యతిరేక కథనాలు వస్తే ఖండించాల్సింది పోయి కక్షపూరితంగా పోలీసులను కార్యాలయాల మీదకి పంపించి భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. వ్యతిరేక వార్తలపై సంబంధిత వేదికల్లో ఫిర్యాదు చేయాలని, ఇలా వేధింపులకు గురి చేస్తూ పత్రికా స్వేచ్ఛను హరించడం తగదని అన్నారు. ఇప్పటికైనా వేధింపులు ఆపాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేయాల్సి వస్తుందన్నారు. అనంతరం గాజువాక తహసీల్దార్ బి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు, జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు కొయిలాడ పరశురామ్, లీలా ప్రసాద్, శశిభూషణ్‌రావు, శేషు, సురేష్, ఎ.అప్పలరాజు, బి.శిరీష, జి.ప్రసాదరావు, కె.సూర్యప్రసాద్, పట్టా రామ అప్పారావు, వాసు, ఎస్.ఎం. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక బాణసంచా స్టాళ్ల ఏర్పాటుపై ఆగ్రహం



స్టాళ్లు ఏర్పాటు చేస్తున్న స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ పార్థసారథి, కార్పొరేటర్ భూపతిరాజు

గాజువాక: వుడా డబుల్ రోడ్డులోని అన్న క్యాంటీన్ వద్ద బాణసంచా స్టాళ్ల ఏర్పాటుకు కొంత మంది ఉపక్రమించారు. ఈ విషయం తెలుసుకున్న గాజువాక సీఐ పార్థసారథి స్టాళ్ల ఏర్పాటు చేస్తున్న వ్యక్తులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోడ్డులో ఐదు బాణసంచా స్టాళ్ల ఏర్పాటు చేస్తున్నట్టు తెలుసుకున్న 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఈ విషయాన్ని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్‌కు తెలిపారు. వుడా డబుల్ రోడ్డులో స్టాళ్ల ఏర్పాటుకు తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని జోనల్ కమిషనర్ స్పష్టం చేశారు. దీంతో ఇదే విషయాన్ని గాజువాక శాంతి భద్రతల విభాగం సీఐ పార్థసారథి వివరించారు. దీంతో ఆయన కార్పొరేటర్‌తో కలిసి స్టాళ్ల ఏర్పాటు చేస్తున్న స్థలానికి చేరుకుని విచారించారు. అయితే, అక్కడ స్టాళ్లు వేస్తున్న కాంట్రాక్టర్‌కు సంబంధించిన వ్యక్తులు తప్ప స్టాళ్లు వేయిస్తున్నవారు కనిపించలేదు. దీంతో స్టాళ్లు వేస్తున్న వారిని సీఐ మందలించారు. ఈ స్టాళ్లకు అనుమతులు లేవని, అనధికారికంగా స్టాళ్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

ఆటలతో మానసిక ఉల్లాసం



క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో ఎంఈవో రమణాజీ తదితరులు

పెదగంట్యాడ: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు మంచి గుర్తింపు లభిస్తుందని మండల విద్యాశాఖాధికారి కంకటాల రమణాజీ పేర్కొన్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలుర అండర్-14, అండర్-17 క్రీడా పోటీలు ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్,ఖోఖో, బాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో పోటీల్లో 12 పాఠశాలల నుంచి 250 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల ఇన్‌చార్జి భానోజీరావు, వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు రామచంద్రనాయుడు, బి. అన్నాజీరావు, ఎం. నిజాముద్దీన్,రవి శ్రావణి, సమీర్‌ఉన్నీసా, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉత్సాహం.. ఉపాధి



గెలుపొందిన క్రీడాకారులతో అతిథులు, నిర్వాహకులు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

● వేడుకగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు

అగనంపూడి: క్రీడలు ఆరోగ్యం, ఉత్సాహంతో పాటు ఉపాధి కల్పిస్తాయని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి అన్నారు. శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పరవాడ మండల స్థాయి కబడ్డీ, ఖోఖో బాలురు, బాలికల (అండర్ -14,17) పోటీలు లేమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల పట్ల మక్కువ, ఆసక్తితో ఆడితే గెలుపు సాధ్యమని, విద్యార్థులు ఇది గ్రహించాలన్నారు. ఈ పోటీల్లో మండలంలోని 12 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, రెండు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు క్రీడా సత్తా చాటి డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, పాఠశాల కమిటీ చైర్మన్ జంపా నాగేశ్వరరావు, పాఠశాల ఇన్‌చార్జి రత్నకుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు సారథ్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లక్ష్మి

నాలుగు లీటర్ల లిక్విడ్ గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న లిక్విడ్ గంజాయి



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

గాజువాక: గాజువాకలో అక్రమంగా రవాణా చేస్తున్న నాలుగు లీటర్ల లిక్విడ్ గంజాయి (గంజాయి నూనె)ను గాజువాక పోలీసులు, సిటీ టాస్క్ ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నారు. దీన్ని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి లిక్విడ్ గంజాయితో పాటు రెండు మోటారు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి శ్రీనగర్‌లోని గార్బేజ్ వెహికల్ పార్కింగ్ యార్డు వద్ద తనిఖీలు నిర్వహించిన పోలీసులు ఆ ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో ఉన్న నలుగురు వ్యక్తులను గుర్తించి విచారించారు. తామంతా అనకాపల్లి జిల్లా చీడికాడ మండలానికి చెందిన కురచ హేమకుమార్, కొలుపూరి వరాహమూర్తి, కురచ సంజీవ్, వంతల కొండబాబు అలియాస్ మన్మథగా పేర్కొన్నారు. వారి వద్ద లిక్విడ్ గంజాయి ఉందని తెలుసుకున్న పోలీసులు గంజాయితో పాటు వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. విశాఖ నగరంలోకి గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు రాకుండా, ఎవరూ వాటి బారిన పడకుండా ఉండాలని పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి పటిష్ఠ చర్యలు చేపట్టారని ఈ సందర్భంగా గాజువాక సీఐ తెలిపారు. ఎవరి వద్దనైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్నట్టు అనుమానం ఉంటే నేరుగా 100 / 112కు గాని, పోలీస్ కమిషనర్ నంబర్ 7995095799కు గాని సమాచారం అందించాలని కోరారు.

శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) అసిస్టెంట్ ప్లంబర్ జనరల్‌లో ఉచిత శిక్షణ కోసం యువత నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నేక్ అసిస్టెంటు డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత, ఫెయిల్ అయిన వారికి ఈ కోర్సులో 2 నెలలు శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల లోపు వారు అర్హులని, ఇతర వివరాలకు 8500502395 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకం కింద ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ అనంతరం సంబంధిత రంగాల్లో ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పిస్తామన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు

కంచరపాలెం: సమాజంలో సైబర్ నేరాలు విస్తృతంగా పెరుగుతున్నందున యువత జాగ్రత్తగా ఉండాలని వన్‌టౌన్ సీఐ జీడీ బాబు పేర్కొన్నారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం సైబర్ క్రైమ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. యువత తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేలా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. శక్తి యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు 9440796019 నంబర్‌కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, ఇన్‌చార్జి డాక్టర్ సుజాత, కృష్ణకుమారి, పి.కె.జయలక్ష్మి, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మ్యాథ్‌మ్యాట్రిక్స్-2025



అతిథులు, ఉపాధ్యాయులతో విద్యార్థులు

కంచరపాలెం: విద్యార్థుల్లో మేధా కౌశలాన్ని, అంతర్గత ప్రతిభా పాటవాలని ప్రోత్సహించేందుకు అంతర్ కళాశాలల గణిత పోటీలు ఎంతో దోహదపడతాయని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అన్నారు. శుక్రవారం గణిత విభాగం, గణాంక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మ్యాథ్ మ్యాట్రిక్స్-2025 ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సమగ్ర విద్య లెక్చరర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, ద్వితీయ భాషల పూర్వాధిపతి డాక్టర్ పి.కె.జె.లక్ష్మి, ఏయూ గణిత ఆచార్య శర్మ మాట్లాడారు. నగరంలో పలు కళాశాలల నుంచి 80 మంది విద్యార్థులు క్విజ్, సుడోకో, మైండ్ మేస్, అర్థం మోజిష్, థింక్ ట్యాంక్ తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రసంశా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కెపెన్ కె.సుజాత, కె.కె. సౌజన్య, జి.యోజన, లక్ష్మి, ఎస్.శ్రీరామ్, గౌరీశంకరరావు, సునీత చౌదరి, వి.భారతి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర సంగీత కచేరీ

సీతంపేట: మెలోడీ క్రియేటర్స్ సంస్థ 25వ వార్షికోత్సవం సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన గాత్ర సంగీత వాద్య కచేరీ అలరించింది. కళాశాల సంస్థల ప్రతినిధి కొణతాల రాజు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బి.కామేశ్వరశర్మ వయోలిన్‌తో సంకీర్తనలు పలికించి, గాత్ర ధారణ చేసి అందరినీ ఆకట్టుకున్నారు. వీరికి మృదంగంపై ఎ.కౌండిన్య, తబలాపై బి.రమణమూర్తి, ఆర్గాన్‌పై సోమేష్ వాద్య సహకారం అందించారు. మెలోడీ క్రియేటర్స్ 25వ వార్షికోత్సవానికి సహకరించిన ప్రతి ఒక్కరినీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సిహెచ్.వి.సత్యనారాయణ, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి. రాజశేఖర్, వి.ప్రభాకర్, ఎం.ఎస్.మాధవ్, కె.వెంకట సురేష్, ఎస్.నారాయణస్వామి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన



రైల్వే స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న క్రైం సీఐ చంద్రమౌళి

మర్రిపాలెం: ఇటీవల జరుగుతున్న నేరాలు, చోరీల నేపథ్యంలో కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కంచరపాలెం, జ్ఞానాపురం రైల్వే స్టేషన్ వంటి ఎనిమిది ప్రాంతాల్లో ఆటో డ్రైవర్లకు చోరీలు ఎలా జరుగుతాయి, వాటికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్రైం సీఐ చంద్రమౌళి వివరించారు. ఆటో డ్రైవర్లు వారివారి ఆటోలను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని, అందరూ ఒకే చోట నిలుపుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టవచ్చన్నారు. ఆటో టైర్లు, బ్యాటరీల చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఆకతాయిల నుంచి ఆటోలు కాపాడుకోవాలని చెప్పారు. నేరాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో క్రైం ఎస్ఐ మారూఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు

డాబాగార్డెన్స్: విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు సమ్మె బాట పట్టారు. విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మీటర్ రీడర్లకు, స్టోర్ హమాలీలకు పీస్‌రేట్ రద్దు చేసి నెలవారీ జీతాలు చెల్లించాలని, అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఏటీపీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేసి పదోన్నతులు కల్పించాలనే డిమాండ్లతో కొన్నేళ్లుగా ప్రభుత్వానికి, యాజమాన్యానికి వినతిపత్రాలు అందజేసినా.. సమస్యలు పరిష్కరించకపోవడంతో సమ్మెకు దిగారు. ఈమేరకు శుక్రవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిటు) ఆధ్వర్యంలో ఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం (సర్కిల్ ఆఫీస్) వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ నాయకులు మాట్లాడుతూ పవర్ జేఏసీ చేస్తున్న పోరాటాలకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, చంద్రశేఖర్, ఆర్.సత్యారావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్‌కే ఎస్‌వీ కుమార్, విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు అవతారం, స్టోర్స్ హమాలీస్ నాయకుడు శ్రీనివాస్, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

దీపావళి విశిష్టతపై కవి సమ్మేళనం



ప్రసంగిస్తున్న డాక్టర్ సూర్యారావు

సీతంపేట: విశాఖ సాహితీ ఆధ్వర్యంలో శుక్రవారం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో దీపావళి విశిష్టతపై కవి సమ్మేళనం జరిగింది. విశాఖ సాహితి ఉపాధ్యక్షురాలు డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి అధ్యక్షత వహించారు. దీపావళి పండగ ప్రశస్తిని వివరించారు. కవి సమ్మేళనం నిర్వాహకుల డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ మనలోని అజ్ఞానమనే చీకటిని పారదోలి.. జ్ఞానమనే వెలుగుకు ప్రతీకగా దీపావళి పర్వదినాన్ని జరుపుకుంటామని చెప్పారు. కవితా గోష్ఠికి విశాఖ సాహితి కార్యదర్శి శంకర్‌నీలు స్వాగతం పలికారు. కవులు భాగవతుల సత్యనారాయణమూర్తి, పిళ్లా రమణమూర్తి, బి.రాధారాణి, కె.వి.రామారావు, ఎ.ప్రసాద్, పరమేశ్వరరావు తమ కవితలతో అలరించారు.